క్లుప్తంగా

చైర్మన్‌గా అవకాశమివ్వడం హర్షణీయం


ఆంజనేయులును సన్మానిస్తున్న నాయకులు

కుల్కచర్ల: మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశమివ్వడం హర్షణీయమని పీఎస్‌పీఎస్ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన ఆంజనేయులు ముదిరాజ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ పోరాటంలో ఆంజనేయులు వివిధ పార్టీల ఆధ్వర్యంలో ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం నామినేటెడ్ పదవుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆంజనేయులును గుర్తించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర మాజీ అసోసియేట్ అధ్యక్షుడు పరందాములు, కాంగ్రెస్ జిల్లా యువజన విభాగం నాయకులు కుమ్మరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల్ తహసీల్దార్ బదిలీ

నూతన తహసీల్దార్‌గా కిషన్


తహసీల్దార్లను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

దుద్యాల్: మండల తహసీల్దార్ బి వెంకటేశ్ ప్రసాద్ పెద్దేముల్ మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కె కిషన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన తహసీల్దార్‌ను, బాధ్యతలు చేపట్టిన కిషన్‌ను రెవెన్యూ సిబ్బంది సన్మానించారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్ ప్రసాద్ మాట్లాడారు. విధి నిర్వహణలో బదిలీలు ప్రతీ ఉద్యోగికి సర్వ సాధారణమేనని పేర్కొన్నారు. ఎక్కడ పని చేసిన కూడా ప్రజల మెప్పు పొందాలన్నారు. అనంతరం నూతన తహసీల్దార్ కిషన్ మాట్లాడారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యాక్రమంలో ఆర్ఐ రవికిషోర్, సిబ్బంది పక్కిరప్ప, లాలప్ప, నరేశ్, చంద్రయ్య, వీరేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

డీటీడీఓ కరుణాకర్‌రెడ్డి


విద్యార్థులతో మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి

బొంరాస్‌పేట: పదో తరగతి విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని డీటీడీఓ కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని బొట్లోని తండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల సౌకర్యాలను, లైట్లు, గదులు, భోజనాలు, బోధన తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరం ఆంగ్ల మాధ్యమంలో విద్యార్థులు మెరుగుపడేలా ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాల నిర్వహణలో ఉపాధ్యాయుల తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విక్రమ్ సింగ్, ఉపాధ్యాయులు శరణప్ప, రాజన్న, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి

పూడూరు: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని చన్గోముల్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్లో ఓపెన్‌హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు పోలీసులు, వారి విధులను తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణ రికార్డులు, పిస్టల్ తదితర ఆయుధాల గురించి వివరించారు. ఈ క్యార్యక్రమంలో ఏఎస్‌ఐ సత్తయ్య పాల్గొన్నారు.

ఉల్లిపై రైతుల ఆసక్తి


ఎన్కేపల్లిలో డ్రిప్ ద్వారా ఉల్లి నారు పెంపకం

- సరైన యాజమాన్య పద్ధతులు అవసరం
- అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే అధికదిగుబడులు

మోమిన్‌పేట: ఉల్లి చేసే మేలు తల్లి చేయదనేది సామెత. నిత్యం తినే కూరగాయల్లో ఎదో రకంగా ఉల్లిని వినియోగిస్తున్నారు. ప్రతి రోజూ సామాన్య కుటుంబీకులనుంచి మొదలు ఉన్నతకుటుంబాల వరకు దీన్ని వినియోగిస్తున్నారు. ముఖ్యంగా హోటళ్లలో దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. మార్కెట్లో కూడా దీనికి అధిక డిమాండ్‌ఉండడంతో రైతులు ఉల్లి సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. మండలంలో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో ఉల్లి సాగు చేస్తున్నారు. ఖరీఫ్, రబీలో కూడా పండిస్తున్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే ఉల్లితో మేలు కలుగుతుందని చెబుతున్నారు. ముఖ్యంగా ఉల్లి సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించడం సులువని ఉద్యానశాఖాధికారి అబ్దుల్ గఫూర్ చెబుతున్నారు.

నేలలు...

మురుగు నీరు నిలవని సారవంతమైన నేలలు అత్యంత అనుకూలమైనవి. క్షార, ఆమ్ల, చౌడు నేలలు అనుకూలమైనవి కావు.

నేల తయారీ...

నేలను 4-5 సార్లు బాగా లోతుగా పదునుగా దున్నుకోవాలి.

ఎరువుల వినియోగం


అబ్దుల్ గఫూర్

ఎకరాకు 8నుంచి10 టన్నుల పశువుల ఎరువును ఆఖరి దుక్కిలో వేసుకొని బాగా కలియదున్నాలి. అదేవిధంగా 80 కిలోల పొటాష్‌నిచ్చే రసాయనిక ఎరువులు, వేప పిండి, ఆముదం పిండిని కూడా వేసుకోవాలి. నాటిన 30 రోజుల తర్వా త నత్రజనితోపాటు పొటాష్ ఎరువులను రెండు దఫాలుగా వేసుకుంటే ఎక్కువ దిగుబడి వస్తుంది.

నారు మళ్లను ఎలా చేసుకోవాలి

నేలను బాగా దున్ని 2 మీటర్ల వెడల్పు, 3 మీటర్ల పొడవుగల ఎతైన నారుమళ్లను తయారు చేసుకోవాలి. ఎకరా నాటడానికి 3 నుంచి 4 కిలోల విత్తనాలు నారుమడిలో పెంచుకోవాలి. నారు కుళ్లు సోకకుండా 10 రోజులకోసారి కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆధునిక పద్ధతిలో రైతులు రెయిన్ డ్రిప్ ద్వారా నారును ఎక్కువగా పెంచుతున్నారు.

నారు నాటడం...

ఆరోగ్యంగా ఉన్న ఉల్లినారును 30 సెంటీమీటర్ల ఎడంతో బోదెలకు రెండు వైపుల నాటుకుంటే బాగా పెరుగుతాయి.

శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలి

మండలంలోని ఏడెనిమిది గ్రామాల్లో ఉల్లి సాగు అధిక విస్తీర్ణంలో చేస్తున్నారు. వాటిని చీడపీడల నుంచి కాపాడుకోవడంలో సరైన సస్యరక్షణ పద్ధతుల గురించి అవగాహన కల్పించే అధికారులు లేకపోవడం బాధాకరం. నాలుగు మండలాలకు ఇంచార్జి ఉండటంతో రైతులకు సరైన సమయంలో అందుబాటులో ఉండడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు సహకరించాలని రైతులు కోరుతున్నారు. ఉల్లి నిల్వ ఉంచుకునేందుకు ప్రభుత్వం మండల కేంద్రంలో శీతల గిడ్డంగిని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

నీటి యాజమాన్యం...

నాటిన 60 రోజుల వరకు 12నుంచి15 రోజుల వ్యవధిలో గడ్డ ఊరే దశలో 6నుంచి7 రోజుల వ్యవధితో 7నుంచి 8 తడులు ఇవ్వాలి..

సమగ్ర సస్యరక్షణ..

ధాన్యపు పంటలతో పంటల మార్పిడి చేయాలి. ఎకరాకు 80 కిలోల వేప పిండి వేసుకుంటే నేలలోని శిలీంధ్రాలను నాశనం చేస్తాయి. తామర, రసం పీల్చుపురుగుల నివారణకు వేప గింజల ద్రావణాన్ని పిచికారి చేస్తే ఏపుగా పెరుగుతుంది.

నిలువ చేయడం ఎలా..?

ఉల్లిని 3నుంచి4 రోజులు పొలం మీద ఆరబెట్టి తర్వాత 10నుంచి12 రోజులు నీడలో ఎండబెట్టి ఆ తర్వాత నిలువ చేస్తే ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. అన్ని విధాల సమగ్ర సస్యరక్షణ చర్యలు, నీటి యాజమాన్యం పాటిస్తే ఎకరాకు రబీలో 120నుంచి140 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: పత్తి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు చేపట్టాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలో అగ్గనూరు సమీపంలోని మారుతి జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. 12శాతం తేమ కలిగిన పత్తికి ప్రభుత్వ మద్దతు ధరతో క్వింటాల్‌కు రూ.7,500 వరకు చెల్లించనున్నట్లు చెప్పారు. పత్తి రైతులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పత్తితో పాటు మండలంలో వరి కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభిస్తారన్నారు. తాండూరు నియోజకవర్గంలో ఐదు పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తాండూరు ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి మాట్లాడారు. యాలాల మండలంలో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించేందుకు అవసరమైన చర్యలను తీసుకున్నామన్నారు. అనంతరం దౌలాపూర్ సమీపంలోని పత్తి మిల్లులో సైతం పత్తి కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు రాజేష్ రెడ్డి, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు రాజు, మొగులయ్య, మండల మాజీ అధ్యక్షుడు భీమప్ప, మాజీ సర్పంచ్‌లు కోలుకుంది హన్మంతు, భీమప్ప, కో ఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా, అగ్గనూరు వీరేశం, ఖాసీం, రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి కాంగ్రెస్ లక్ష్యం

కుల్కచర్ల: పేదల అభ్యున్నతి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పరిగి ఎమ్మెల్యే టీ.రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చౌడాపూర్ మండల కేంద్రంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


యాలాల: కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

ఎట్టకేలకు బస్సు సర్వీసు ప్రారంభం


ఎన్కేపల్లిలో ఆర్టీసీ బస్సు సేవలు ప్రారంభం

హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

బొంరాస్‌పేట: ఎట్టకేలకు బొంరాస్‌పేట మండలం ఎన్కేపల్లికి మంగళవారం కడా అధికారి వెంకట్‌రెడ్డి, పరిగి డిపో మేనేజరు కరుణశ్రీ బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కరోనా అనంతరం గ్రామానికి ఆర్టీసీ బస్ సౌకర్యం నిలిచిపోయాయని, గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తిరిగి బస్సు సర్వీసును కల్పించామన్నారు. ప్రస్తుతం నిత్యం ఉదయం 8.50గంటలకు, తిరిగి కొడంగల్ నుంచి గ్రామానికి సాయంత్రం 6.10 వరకు బస్సు సౌకర్యం కల్పించామని డీఎం కరుణశ్రీ తెలిపారు. గ్రామంలోని రైతులు, కూలీలు, వ్యాపారులు, విద్యార్థులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులు, మహిళలు బస్సు సర్వీసును ప్రారంభించడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, ఎఫ్ఏ పెద్దకుర్వ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ మేనేజర్‌ను బదిలీ చేయాలి


నోడల్ అధికారి యాదయ్యతో మాట్లాడుతున్న స్థానిక నాయకులు, లబ్ధిదారులు

కుల్కచర్ల: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు వినియోగదారులతో ఇబ్బందికరంగా వ్యవహరించే ఎస్‌బీఐ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్ కుమార్‌లు నోడల్ అధికారి యాదయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వినియోగదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మేనేజర్ వినోద్ కుమార్‌ను కుల్కచర్ల బ్యాంకు నుంచి బదిలీ చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజలతో స్నేహపూర్వకంగా, సహాయకారిగా ఉండాల్సిన అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. తక్షణమే అతనిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యాబోధన చేయాలి


విద్యార్థులను చదివిస్తున్న లాల్యనాయక్

కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యనాయక్

దోమ: ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధన చేయాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యనాయక్ పేర్కొన్నారు. మంగళవారం దోమ మండల పరిధిలోని పలుగు తండా పాఠశాలతో పాటు ఆయా పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదులను, రికార్డులను ఆయన పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థుల ఎఫ్ఎల్ఎన్ వర్క్ షీట్స్ పరిశీలించి విద్యార్థులతో చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య బోధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం సమ్మెటివ్ పరీక్ష పేపర్లను పరిశీలించి ప్రధానోపాధ్యాయుడు జలాలోద్దీన్‌కు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటిస్తూ మెను ప్రకారం అందజేయాలని తెలిపారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఏ-బ్లాక్ అధ్యక్షుడు నర్సిములు

పెద్దేముల్: ఉచిత వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తాండూరు నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షుడు లోంక నర్సిములు పేర్కొన్నారు. మంగళవారం ఇందూరు గ్రామంలో యల్‌యస్‌ఆర్ యువసేన సహకారంతో వికారాబాద్ మహవీర్ జనరల్ ఆస్పత్రి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందూరు గ్రామంలో మొత్తం 180 మందికి వైద్య పరీక్షలు అందజేశారన్నారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తట్టెపల్లి సహకార సంఘం మాజీ చైర్మన్ నరేందర్, మాజీ సర్పంచ్ ప్రకాశం, యువ నాయకుడు మహేష్, మహవీర్ డాక్టర్లు సంకీర్తన, సాయిస్మరణ, స్వరోచిత, అతుల్, మతిన్, సిబ్బంది కో ఆర్డినేటర్ శ్రీకాంత్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, సుధాకర్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

చెకుముఖి పోటీలను విజయవంతం చేయండి

బొంరాస్‌పేట: చెకుముఖి సైన్సు సంబరాలు 2024 విజయవంతం చేయాలని ఇంచార్జి హెచ్‌ఎం ప్రశాంత్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నవంబర్ 7న పాఠశాలలోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహించనున్న ఈ పరీక్షలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఇక్కడ గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు మండలస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. అనంతరం చెకుముకి పోస్టర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు బాకారం చంద్రశేఖర్, మల్లయ్య, అనిల్‌కుమార్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన

మర్పల్లి: బీజేపీ సభ్యత్వ నమోదుకు జిల్లాలో అనూహ్య స్పందన లభిస్తుందని చేవేళ్ల నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పిల్లిగుండ్ల, పట్లూర్, మర్పల్లి గ్రామాలలో చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి, కార్యదర్శి బన్నే మల్లేశ్ యాదవ్, మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డితో కలిసి ఆకస్మిక తనఖీ చేశారు. ఈ సందర్భంగా కేఎస్ రత్నం ఆయా గ్రామాల్లో మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, నవీన్‌కుమార్, ప్యాట శంకర్, బలరాంగౌడ్, నంద లక్ష్మణ్, జైపాల్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి నాగయ్య, జిల్లా మహిళ మోర్చా ప్రధాన కార్యదర్శి మహేశ్వరి పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటినే తాగాలి

- ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఈఈ చల్మారెడ్డి
- ముగిసిన వాటర్‌మెన్‌ల శిక్షణ


మాట్లాడుతున్న చల్మారెడ్డి

తాండూరు రూరల్: జిల్లా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు మిషన్ భగీరథ నీటినే తాగాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఈఈ చల్మారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తాండూరు మండల ఎంపీడీఓ కార్యాలయంలో వాటర్‌మెన్‌ల శిక్షణ ముగింపు కా ర్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాటర్ మెన్‌లకు ప్రధానంగా నాలుగు అంశాల్లో తర్ఫీదునిచ్చామన్నారు. ముఖ్యంగా పంపుసెట్ల మరమ్మతులు, లీకేజీలు, కెమికల్ టెస్టింగ్, హ్యాండ్‌పంపు రిపేర్లపై అవగాహన కల్పించామన్నారు. ప్రజలకు రక్షిత మంచినీటిని సరఫరా చేయడంలో వాటర్ మెన్‌లే కీలకమన్నారు. ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంకులను ప్రతీ నెల మొదటి రోజు, 11న, 21వ తేదీల్లో బ్లీచింగ్ పౌడర్ ద్వారా శుభ్రం చేయాలని చెప్పారు. తాగేనీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కా ర్యక్రమంలో డీఈలు విజయ్‌కుమార్, తేజ్‌బాబు, ఏఈలు సాయి ప్రణీత్, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి కృషి చేయండి

ఎమ్మెల్యేకు బీసీ సంఘం నాయకుల వినతి


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని బీసీ శ్మశానవాటిక అభివృద్ధికి కృషి చేయాలని బీసీ సంఘం నాయకులు మంగళవారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి శ్మశానవాటిక అభివృద్ధికి రూ.65 లక్షలు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించలేదన్నారు. బీసీ కులాలకు చెందిన వ్యక్తులు చనిపోతే వారి అంత్యక్రియలు నిర్వహించడం ఇబ్బందికరంగా ఉందన్నారు. అక్కడ ఇష్టానుసారంగా మలమూత్ర విసర్జన, చెత్తాచెదారం, జంతు కళేబరాలను వేయడం వంటివి చేస్తున్నారు. దీంతో అంత్యక్రియలకు వచ్చే వారు దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ విషయంలో ఎమ్మెల్యే చొరవ చూపి అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, షుకూర్, వెంకటేష్, లక్ష్మణాచారి, బసంత్, రాము, రమేష్, కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, వేణు, శ్రీధర్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• పెద్దేముల్ తహసీల్దార్ బదిలీ

పెద్దేముల్: పెద్దేముల్ తహసీల్దార్‌దార్ కిషన్ నాయక్ బదిలీ అయ్యారు. మంగళవారం కిషన్ నాయక్ దుద్యాల మండలంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

• మొక్కల ధ్వంసంపై ఫిర్యాదు

తాండూరు రూరల్: మండల పరిధిలో ఐనెల్లి గ్రామంలోని వన నర్సరీలో మొక్కలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి అపర్ణ కరన్‌కోట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

• ముగిసిన నీటి సహాయకుల శిక్షణ

యాలాల: మిషన్ భగీరథ తాగునీటి సరఫరా సహాయకులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. మండల పరిషత్ సమావేశపు హాల్లో సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎస్ఈ ఆంజనేయులు, ఈఈ చల్మారెడ్డి, డీఈ తేజ్‌బాబు తదితరులు హాజరయ్యారు. అనంతరం నీటి సహాయకులకు హాజరు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

• అనంతగిరిలో...

అనంతగిరి: గ్రామ పంచాయతీల్లో వాటర్‌మెన్‌లకు నాలుగు రోజులుగా ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో ఆర్‌డబ్లుఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. అనంతరం ఆర్‌డబ్లుఎస్ ఈఈ చల్మారెడ్డి సర్టిఫికెట్‌లు అందజేశారు.

• తాండూరులో ఆధునిక లైబ్రరీ భవనం..

తాండూరు: తాండూరులోని పాత గ్రంథాలయ భవనం స్థానంలో అత్యాధునిక హంగులతో భవనం నిర్మిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తాండూరు పట్టణంలోని గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• ఎల్‌ఓసీ అందజేత

తాండూరు: అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు సీఎం సహాయ నిధి ఉపయోగపడుతుందని, దీంతో మంజూరైన ఎల్‌ఓసీలను మంగళవారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అందజేశారు.

• చట్టాలపై అవగాహన

మర్పల్లి: పోలీస్ చట్టాలపై ప్రతి విద్యార్థి తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని మర్పల్లి ఎస్ఐ సురేష్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోలీస్ అమరవీరుల సంస్మరణల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా పోలీస్ చట్టాలపై ఓపెన్‌హౌజ్ నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

• తాండూరులో మాస్టర్ ప్లాన్ సర్వే షురూ

తాండూరు: తాండూరు మున్సిపల్ పరిధిలో అమృత్ భారత్ 2.0 మాస్టర్ ప్లాన్ సర్వే మంగళవారం ప్రారంభమైంది. సర్వేఆఫ్ ఇండియా, డీటీసీపీ సంయుక్త ఆధ్వర్యంలో చేపడుతున్న మాస్టర్ ప్లాన్ సర్వే కోసం సర్వే బృందం మున్సిపల్ చుట్టు హద్దులు నిర్దేశించారు. ఆలస్యంగా సర్వే మొదలు పెట్టడం వల్ల డ్రోన్ సర్వే బుధవారం నుంచి మొదలు కానుంది.

• పక్కా భవనం నిర్మించాలని దీక్షలు

అనంతగిరి: వికారాబాద్‌లో డిగ్రీ కళాశాలకు పక్కా భవనం నిర్మించాలని ఏబీవీపీ నాయకులు మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు మాట్లాడారు. డిగ్రీ కళాశాలకు పక్కా భవనం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీంతో విద్యార్థులకు తరగతిగదులు చాలక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి పక్కా భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహేష్, శివప్రసాద్, దయాకర్, సాయితేజ, సాయికుమార్, విష్ణు, రాందాస్, బాలరాజు, బాలు, సంతోష్, రామకష్ణ, కార్తీక్, నర్సింహా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

